# ఊరించే పువ్వో మురిపించే మొగ్గ

నిండుచూలాలిలా జనాన్ని మోయలేక మోసుకొంటూ వొచ్చి తిరుపతి స్టేషన్‌లో ఆగింది రైలుబండి

అప్పటికే అంతులేని జనంతో కిటకిటలాడే ఆ స్టేషన్లో రద్దీ ఎక్కువైంది.

ఇసకేస్తే రాలనంత జనసందోహం!

ఆడా మగా అనే భేదం లేకుండా తోసుకుంటూ ఎక్కే జనం, దిగే జనం!

కొంచెంసేపు నిదానిస్తే ఎక్కడ బండి కదిలిపోతుందో అని దిగే ప్రయాణీకులు తమ సామానుల్ని దింపుకోడానికి బహు హడావిడి పడిపోతున్నారు

ఆలస్యం ఆశాభంగం — అన్నట్టు ఎక్కడ నిల్చోడానికైనా స్థలం లభ్యం కాకుండా పోతుందో అని ఎక్కే ప్రయాణీకులు మరింత హడావిడి పడిపోతున్నారు.

మధ్యలో విద్యార్థులు పానకంలో పుడకలా పుస్తకాలని కిటికీల గుండా విసిరేసి తమ సీట్లని రిజర్వ్ చేసిపెట్టుకొంటున్నారు.

ఇదంతా చూస్తున్న సుశీలకేమీ పాలుపోవడంలేదు. ఏ పెట్టె చూసినా జనం క్రిక్కిరిసి వున్నారు. ఫుట్‌బోర్డులపై సైతం నిల్చుని వున్నారు. 'ఈ బ్రహ్మోత్సవం వస్తే ఎప్పుడూ యీ ఖర్మేను! నిల్చోడానికి కూడా స్థలం దొరికి చావదు!' అని విసుక్కొని, నిరా

— జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి

శగా 'ఈరోజు మరి సెకెండ్ ట్రయినే నేమో గతి!' అనుకొంది.

'అమ్మయ్యో... సెకెండ్ ట్రయినా? రాత్రి ఎనిమిదై పోతుందే! స్టేషన్ నుంచి పల్లెకు రెండు ఫర్లాంగులు నడవాలే! కటిక చీకటే! రాత్రి... అందునా వొంటరైనూ...' తలుచుకొంటున్న కొద్దీ గుండెలు గుబగుబలాడేయి — సుశీలకి.

బయల్దేరడానికి టైం అయిపోయిందని గట్టిగా కూతేసి చెప్పి, బయల్దేరింది రైలు.

ఆలోచిస్తుంటే యిక ప్రయోజనం లేదని ధైర్యంచేసి తన ముందున్న కంపార్ట్‌మెంట్‌లోకి ఎలాగో ఎక్కేసింది సుశీల. ఏదో ఆడపిల్లకదా అని ముందున్న వాళ్ళంతా దయదలచి లోనికెళ్ళడానికి కాస్త సందిచ్చారు. వాళ్ళకంతా కళ్ళతోనే కృతజ్ఞతలు ఘటించి లోనికెళ్ళింది — ఎక్కడైనా కాస్త

కూర్చోడానికి స్థలం దొరుకుతుందేమోనని.

సుశీల తెలుగు విద్వాన్ చదువుతోంది తిరుపతిలో. స్వగ్రామం తిరుపతికి యిరవై అయిదు మైళ్ళ దూరంలో వున్న పాకాల టౌనుకు దరిదాపుల్లో వున్న ఓ పల్లెటూరు. రోజూ ఆ ట్రయిన్‌లో కాలేజీకి వెళ్ళి వొచ్చేది. తల్లిదండ్రులు బీద వాళ్ళు కావడంవల్ల సుశీలను స్కూల్ ఫైనల్‌తోటే నిలిపేయాలనుకొన్నారు. కానీ సుశీల యింకా చదువుకోవాలని వొకటేగా మంకుపట్టు పట్టడంచేత, పైగా మంచి మార్కులతో పాసుగావడంచేత, ఇనుగూపొయ్యగంతా పై చదువుకేస్తే మంచి అభివృద్ధికొస్తుందని ప్రోత్సహించడంచేత — తుదకు విద్వాన్‌కోర్సు చదవటానికి తల్లిదండ్రులు వొప్పుకొన్నారు.

లోపలికెళ్ళి చూసింది గదా, కంపార్టుమెంటు నిండుగా విద్యార్థులే! (మగ), ఆడపిల్లల్ని ఏడిపించే ఆకతాయిలు! 'వచ్చేంరా దేవుడా...' అనుకొంది

సుశీలను చూట్టంతో వాళ్ళంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టారు — అందాకా ఏవో సినిమాకబుర్లాడుకొంటున్న వాళ్ళల్లా, తర్వాత సుశీల వేషధారణ గురించి చర్చ మొదలెట్టారు. అందులో ఓ బావుకుడు అప్పటికప్పుడే రెండు చరణాల పాట అల్లి ఆలాపించసాగేడు—

'విద్వానమ్మ చీర కట్టింది.
విద్యార్థులో కలత పుట్టింది..'

అందరూ ఆపాటని రాగయుక్తంగా ముక్తకంఠంతో అందుకొన్నారు.

సుశీల వినలేక అభిమానంతో చచ్చిపోతుంది నరనరం అభిమానంతో దహించుకు పోతోంది ప్రొద్దున్న వున్నపావడా అన్నీ మాసిపోయినందువల్ల, ఉతుక్కోవడానికి సబ్బు అయిపోయినందువల్ల చీర కట్టుకు రావల్సి వొచ్చింది — అదీ తల్లి ప్రోద్బలంతో. అంతేకాని షోక్కు కాదు; వీళ్ళ ఆకర్షణకు అంతకన్నా కాదు దాన్ని ఆసరాగా తీసుకొని యింతగా అల్లరిచేయాలా? అవమానం చేయాలా? ఛీఛీ! కొంచెమైనా బుద్ధివుండాలి! సభ్యతుండాలి! అయినా చదివే అమ్మాయిలు చీర కట్టుకోకూడదా ఏం? అసలు మేం కట్టుకుంటే వీళ్ళకేం? అది మాయిష్టం! మధ్యలో ఎగతాళి చేయటానికి వీళ్ళెవరు? వీళ్ళిట్లాగేనా మేమనేది? ఏవి తొడుక్కొన్నా, ఏమి చేసుకొన్నా తలెత్తి చూసిన పాపాన పోమే! ఛీ!.. బుద్ధిలేకపోతేసరి ఓ అమ్మాయి వొంటరిగా దొరికినంత మాత్రాన యింతగా చులకనమా? మెడబిరుసుతనమా? ఉక్రోషం పట్టలేక వాళ్ళకేసి కొరకొరా చూసింది.

"పతివ్రతకు కోపం వొచ్చినట్లుంది రోయ్! ఊర్కోనండి లేకపోతే ఘోరంగా శపించగలదు". ఒకడు సుశీల చూపులపై గామెంట్ విసిరాడు.

"డొన్త్రోయ్!" అందరూ ఘొల్లున నవ్వారు.

ఆ నవ్వులు శిశిత బాణాల్లా హృదయంలోకి దూసుకెళ్ళాయి సుశీలవిలవిల్లాడిపోయింది. ఏడ్పువచ్చే అంత పనైంది. కానీ, ఏం చేయగలదు? ఏంచేయలేకనే పాపం తలదించుకొంది. 'ఛీ.. ఏం పుటకో యీ ఆడపుటక! ఎక్కడకెళ్ళినా అలానే! బజారులోని వస్తువులా చూస్తారు. ప్రాణం తేలేస్తారు ఈ ఆడజన్మమెత్తి

పుట్టడంకన్నా ఏ అడవుల్లోనో మానై పుట్టడం నయం' తనజన్మని తానే తిట్టిపోయసాగింది.

రైలు చంద్రగిరి స్టేషన్‌లో ఆగింది.

ఐదారేళ్ళున్న చిన్న అమ్మాయితో బాటు ఓ పెద్దాయన సుశీలవున్న కంపార్టుమెంటులోకే ఎక్కాడు.

ఆ అమ్మాయిని చూట్టంతోటే ఆబ్బాయిలందరూ "రా అమ్మా!.. రా! .." అని ఆప్యాయంగా ఆహ్వానించి, అందరూ కాస్త సర్దుకూర్చొని ఆ అమ్మాయిని మధ్యలో చోటిచ్చి కూర్చోబెట్టుకొన్నారు.

దాదాపు ఓ అర్థగంటనుంచీ కాళ్ళు నొప్పులు పుట్టేలా నిల్చొంది తను. సానుభూతిగా కూర్చోమన్న పాపాన పోలేదు కదా, పైగా అల్లరిపెట్టారు. అంతటి గడుగ్గాయిలు ఓ చిన్నపాప కన్పించగానే ఎంత వాత్సల్యం చూపిస్తున్నారు! అబ్బ! ఎంతమంత్రముగ్ధుల్ని చేసిందీ పాప! విస్మయంగా ఆ పాపకేసి చూడసాగింది — సుశీల.

"నీ పేరేమిటమ్మా!" ప్రేమగా అడుగుతున్నాడు — ఇందాకటి తనమీద పాట అల్లిన భావకవి.

"నా పేరు.. బేబీ.." వచ్చీ రాని మాటల్తో ముద్దుముద్దుగా చెపింది.

"నీవేం చదువుతున్నావ్?" మరో అబ్బాయి ఆపాప చిన్నారి బుగ్గల్ని పుణుకుతూ అడిగాడు.

"రెండో తరగతి..." సమాధానం చెప్పింది. చిన్ని చక్రాల్లాంటి కళ్ళను తిప్పుతూ.

ఇలా అందరూ తలకొక ప్రశ్న వేశారు.

ఆ అమ్మాయి అందరికీ ముద్దుముద్దుగా సమాధాన మిచ్చింది.

ఆ అమ్మాయిని చూస్తుంటే మళ్ళీ మళ్ళీ చూడాలన్నంతటి ముచ్చటవేస్తోంది.

ఆ అమ్మాయి పలుకులు వింటుంటే మళ్ళీ మళ్ళీ వినాలన్నంతటి వుత్సుకత కల్గుతోంది.

'చక్కటి అమ్మాయి! చిన్న అమ్మాయి! ఎంత ముద్దుగా బొద్దుగా వుంది! ముద్దెట్టుకోవాలన్నంత ప్రేమ పుడుతోంది. అందుకే కాబోలు, ఇందాక తనని అల్లరిపెట్టిన ఆకతాయిల చేతనే, ఆదరింపబడింది! గౌరవింపబడింది! నిజంగా యీ పాప దేవుని పాప!...' అంతలోనే సుశీల మొహం నల్లబడింది. హృదయంలో ఆ పాప భవిష్యత్ మీద ఏవేవో ఆలోచనలు ముప్పిరిగొన్నాయి సుశీల హృదయం హోరెత్తిన సముద్రంలా అల్లలాడ సాగింది.

ఆ పాప .. పసిపాప!

కల్లాకపటం తెలియని పాప!

అసలు లోకమంటే ఏమిటో ఎరుగని పాప!

తనలా వోనాటికి పెద్దదౌతుంది.

ఇప్పుడు — చెల్లెలిలా వాత్సల్యంగా చూసే వాళ్ళకంటనే పడుతుంది

అప్పుడు.. అప్పుడు.. వీళ్ళే. ఇంత గారాబుచేసిన వాళ్ళే. కర్కశహృదయులౌతారు!

తనని అపహసించినట్లు అపహాస్యం చేస్తారు!

వరాచకాలాడుతారు - ప్రాణం తీసేస్తారు - చిత్రవధ చేసేస్తారు!

అందుకే ఆ అమ్మాయితో గట్టిగా చెబుదామనిపించింది-

ముందే నొక్కి హెచ్చరించాలనిపించింది—

తనలా బాధలు పడకుండా

తనలా రోదనలపాలు కాకుండా-

పాపా, నువ్వు పెద్దదానివి కావొద్దు!

నాలా భంగ పడొద్దని!

అభిమానంతో చావొద్దని!

చచ్చినా పెద్దదానివి కావొద్దని. కావొద్దని! . ఆలోచనల నుండి తేరుకొనింది సుశీల.

తేరుకొని పారచూచింది.

పాప అక్కడ లేదు!

అంతులేని ఆశ్చర్యం! అమితమైన ఆవేదన!

ఎప్పుడో దిగిపోయిన పాపకోసం దిగులుపడింది సుశీల, □

---

గదిలోపలికి రాకెట్లా దూసుకొనివచ్చిన ఒక ప్రౌఢ యిలా అడిగింది.

'డాక్టర్, నిర్మొహమాటంగా చెప్పండి నాలోని లోపం యేమిటి ?'

అతను ఆమెను పైనించి కిందికి బాగా పరిశీలించి యిలా అన్నాడు.

'మేడమ్, నేనుమీకు 3 విషయాలు చెప్పదలిచాను. 1 మీ బరువు అర్జంటుగా పాతిక కిలోలు తగ్గాలి. 2 ఇప్పుడు మీ ముఖాన వున్న పౌడర్ లో పదోవంతు పూసుకుంటే చాలు మీరు చాలా అందంగా కనిపిస్తారు. యిక చివరిది, నేను చిత్రకారుణ్ణి, డాక్టరు గారుండేది ప్రక్క పోర్షన్లో.